క్లుప్తంగా

మొక్కలు నాటండి



మొక్క నాటుతున్న డీపీఓ దేవకీదేవి

నంగునూరు(సిద్దిపేట): వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో విరివిగా మొక్కలు నాటాలని డీపీఓ దేవకీదేవి అధికారులను ఆదేశించారు. బద్దిపడగలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లోను రోడ్లు, ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటి నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మణప్ప, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యవసాయ పద్ధతులపై శిక్షణ



రైతులకు వివరిస్తున్న శాస్త్రవేత్త మల్లేష్

ములుగు(గజ్వేల్): స్థానిక రైతువేదికలో అధికారులు ఉద్యాన పంటలు వ్యవసాయ పద్ధతులపై రైతులకు శుక్రవారం ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. జీడిమెట్ల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీఓఈ) ఆధ్వర్యంలో జరిగి ఈ కార్యక్రమంలో ఉద్యాన విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త డా.మల్లేశ్ కూరగాయల సాగు, చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. ములుగు వ్యవసాయ సంచాలకుడు అనిల్, వ్యవసాయ అధికారి ప్రగతి, జీడిమెట్ల ఉద్యానశాఖ అధికారులు జలందర్, రమేశ్, వ్యవసాయ విస్తరణ అధికారి పృథ్వీరాజ్, వివిధ సంస్థల ప్రతినిధులు సుబ్బారావు, ప్రసాద్ పాల్గొన్నారు.

ఉచిత డ్రైవింగ్ శిక్షణ



శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వంశీధర్

చిన్నకోడూరు(సిద్దిపేట)/నంగునూరు(సిద్దిపేట): స్థానిక కేఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత డ్రైవింగ్ శిక్షణ కేంద్రాలను ఫౌండేషన్ చైర్మన్ వంశీధర్‌రావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతీ, యువకులకు ఉచితంగా డ్రైవింగ్ శిక్షణ ఇచ్చి లైసెన్స్ అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అబ్బిరెడ్డి, ఫౌండేషన్ సభ్యులు, యువత పాల్గొన్నారు.

జగన్నాథ రథయాత్ర రేపు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న రంగతీర్థదాస్

సిద్దిపేటకమాన్: సిద్దిపేటలో నిర్వహిస్తున్న జగన్నాథ రథయాత్రను జయప్రదం చేయాలని ఇస్కాన్ ఆలయ ప్రతినిధి రంగతీర్థదాస్ కోరారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన రథయాత్రకు చెందిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఒడిసాలో మాత్రమే జరిగే జగన్నాథ రథయాత్రను హరేకృష్ణ సత్సంగం ఆధ్వర్యంలో మొట్టమొదటి సారిగా సిద్దిపేటలో నిర్వహించనున్నట్లు తెలిపారు. 29న మధ్యాహ్నం మూడు గంటలకు వెంకటేశ్వర దేవాలయం పక్కన ఉన్న శ్రీనివాస ధ్యానమందిరం నుంచి రథయాత్ర ప్రారంభం కానున్నట్లు తెలిపారు. సమావేశంలో మల్లేశం, న్యాయవాది వరుకోలు రాజలింగం, బుచ్చిబాబు, లక్ష్మణ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాతకు కుంకుమార్చన



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

చేర్యాల(సిద్దిపేట): స్థానిక దుర్గామాత ఆలయంలో శుక్రవారం ఘనంగా కుంకుమార్చన నిర్వహించారు. దుర్గ శాకంబరి నవరాత్రి ఉత్సవాలలో రెండో రోజు కూడా అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భగా అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో పట్టణ భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

జీలుగ సాగు.. భూసారం బాగు

రసాయన ఎరువులు ఎంత ఎక్కువగా వినియోగిస్తే అంత అధికంగా దిగుబడి సాధించవచ్చనే నమ్మకంతో రైతులు ఉన్నారు. అందుకే తమ పొలాలలో ఎక్కువ మొత్తంలో రసాయన ఎరువులను కుమ్మరిస్తున్నారు. దీనివల్ల భూ సారం తగ్గి దిగుబడులు గణనీయంగా తగ్గిపోతున్నాయి. దానికి తోడు పెట్టుబడులు కూడా పెరిగిపోతున్నాయి. నేలలో జీవం తగ్గి నిస్సారంగా మారుతున్నాయి.

- పచ్చిరొట్ట పెంపకంతో నేలకు జీవం
- తక్కువ ఖర్చు.. ఎక్కువ దిగుబడి
- రైతుల్లో పెరుగుతున్న అవగాహన
- సేంద్రియ ఎరువుల వైపు రైతుల చూపు



ఏపుగా పెరిగిన జీలుగ పంట

మర్కూక్(గజ్వేల్): పచ్చిరొట్ట పైర్ల పెంపకంతో భూసారం పెరుగుతుందని వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. పిల్లిపెసర, జీలుగ, జనుము సాగుచేసి భూమిలో కలియదున్నడం వల్ల నేలలో జీవం పెరిగి దిగుబడులు కూడా అధికంగా ఉంటాయని చెబుతున్నారు. మర్కూక్ మండలంలో గత సంవత్సరం రైతులు 1,370 ఎకరాలలో జీలుగ సాగుచేశారు. ఈ సంవత్సరం వానాకాలం ప్రారంభం కాకముందే 740 ఎకరాలలో సాగుచేసేందుకు అధికారులు రైతులకు జీలుగ విత్తనాలు అందజేశారు.

అధిక లాభాలు

ఎక్కువ రసాయన ఎరువులు చల్లడం వల్ల దిగుబడి తగ్గిపోతుందని, భూమితో పాటు, నీరు కూడా కలుషితమవుతుందని రైతులు అంటున్నారు. తక్కువ ఖర్చుతో అధిక లాభాలు సాధిస్తున్నామని జీలుగ వేసిన రైతులు చెబుతున్నారు.

పచ్చిరొట్ట సాగుపై ఆసక్తి

మండలంలోని ఎర్రవల్లి, మర్కూక్, నర్సన్నపేట, దామరకుంట, వర్దరాజ్‌పూర్, నర్సన్నపేట, పాములపర్తి, గంగాపూర్, దామరకుంట, చేబర్తి తదితర గ్రామాలలో చాలా మంది రైతులు పచ్చిరొట్ట సాగుకు మొగ్గు చూపారు. వ్యవసాయ అధి కారుల సూచనలు, సలహాలు పాటిస్తూ తొలకరి జల్లులు కురిసినప్పుడే పచ్చిరొట్ట విత్తనాలు వేశారు.

సేంద్రియ ఎరువులతో మేలు

సేంద్రియ ఎరువులు వినియోగించడం వల్ల ఆరోగ్యకర సాగుకు అవసరమయ్యే సూక్ష్మ జీవులు వృద్ధి చెందుతాయి. ఉతాక్పదకత సామార్థ్యాన్ని పెంచుతాయి. భూమిలో చాలా రకాల పోషకాలు అధికమవుతాయి. కలుపు మొక్కలు పెరగకుండా కూడా నివారిస్తాయి.



విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

దిగుబడి అధికం



రైతుల్లో రోజురోజుకు అవగాహన పెరుగుతోంది. జీలుగ సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రతి గ్రామంలోను రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. వర్షాకాలం ఆరంభంలో తొలకరి జల్లు కురవగానే ఈ విత్తనాలు జల్లు కోవాలి. ఎకురాకు 15 నుంచి 20 కిలోల విత్తనాలు వెదజల్లిన తర్వాత ట్రాక్టర్‌తో కలియదున్నాలి. అవి 30 నుంచి 40 రోజుల్లో పంట పూత దశకు చేరుకుంటుంది. పూతదశలో ఉన్న పంటను ట్రాక్టర్ రోటవేటర్ లేదా ఎద్దుల సహాయంతో దున్నాలి. తరువాత సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ ఎరువును భూమిలో చల్లాలి. నీరు వదలితే పైర్లు కుళ్లిపోయి పచ్చిరొట్ట ఎరువుగా తయారవుతుంది. వర్షా కాలంలో భూమి కోతకు గురికాకుండా ఉంటుంది. భూమిలో తేమ, పోషకాల శాతాన్ని పెంచుకోవచ్చు. మంచి సూక్ష్మ జీవులు వృద్ధి చెందుతాయి. దీనివల్ల పంటకు 27 శాతం నత్రజని, 53 శాతం భాస్వరం, 22 శాతం పొటాషియం అదనంగా అందుతాయి. దీని వల్ల రైతులకు ఖర్చు తగ్గి దిగుబడి పెరుగుతుంది.

– అనిల్ కుమార్, ఏడీఏ

అధికారులకు సమ్మె నోటీసులు

గజ్వేల్‌రూరల్/కొండపాక(గజ్వేల్): కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య అన్నారు. జూలై 9న జరగనున్న సార్వత్రిక సమ్మె నేపథ్యంలో మెప్మా పరిధిలో పనిచేస్తున్న ఆర్పీలు, మున్సిపల్ కార్మికులు శుక్రవారం గజ్వేల్ మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణకు, అలాగే ఐసీడీఎస్ కార్యాలయంలో అధికారులకు సమ్మె నోటీసులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం నిర్వహించతలపెట్టిన సమ్మెను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో స్వామి, రంగారెడ్డి, సుభద్ర, కుమార్, యాదగిరి, కల్పన, ఫాతిమ, మనోహరి, జ్యోతి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా కుకునూరుపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ నితీష్‌సాయి సమ్మె నోటీసు అందజేశారు. ఆయన మాట్లాడుతూ రూ.20 వేలు కనీస వేతనం అందించాలన్నారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బాల్‌నర్సయ్య, సాయికుమార్, నరహరి, లక్ష్మణ్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్‌రూరల్: మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణకు నోటీసు అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

చెత్తకుప్పలు.. విజృంభిస్తున్న దోమలు



గాంధీనగర్‌లో పదిరోజుల నుంచి రోడ్డుపైనే ఉన్న చెత్త కుప్పలు

మండలంలోని చాలా గ్రామాల్లో రోడ్ల మీద చెత్తకుప్పలు పెరిగిపోయాయి. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల వైపు కన్నెత్తి చూడటం లేదు. డీజిల్ పోయించేందుకు కూడా డబ్బులు లేకపోవడంతో చెత్తను తరలించే ట్రాక్టర్లు ముందుకు కదలడం లేదు. ప్రత్యేక, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు గ్రామాలను సందర్శించక పోవడంతో ప్రజలు తమ సమస్యల గురించి ఎవరికి చెప్పుకోవాలో తెలియని స్థితిలో పడ్డారు. చెత్తాచెదారం పెరిగిపోవడంతో దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయి. రోగాల బారిన పడాల్సివస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– హుస్నాబాద్‌రూరల్

మల్లన్న ఆలయంలో వేలం పాటలు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో శుక్రవారం ఈఓ అన్నపూర్ణ ఆలయానికి సంబంధించిన పలు అంశాలపై ఈ టెండర్, సీల్డ్ టెండర్, బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. కొబ్బరి కాయలు విక్రయించే లైసెన్సు హక్కును కొమురవెల్లికి చెందిన డి.విష్ణుమూర్తి రూ.45,50,116లు అధికంగా పాటపాడి దక్కించుకున్నారు. ప్రసాదాల తయారీ హక్కును కనకమల్లేశం, మొక్కుబడి టికెట్స్, ఇతర బుక్స్ ప్రింటింగ్‌ను ముల్కనూర్ లక్ష్మీ ప్రింటర్స్ సీల్డ్ టెండర్‌లలో తక్కువ కోడ్‌వేసి దక్కించుకున్నారు. రాతిగీరల పక్కనగల షాపింగ్ కాంప్లెక్స్‌లోని మూడో నంబరు షాపులో వ్యాపారం చేసుకునేందకు నెల ఒక్కంటికి రూ.8,200లకు కె.తార దక్కించుకోగా, 20వ నంబరు షాపును నెల ఒక్కంటికి రూ.8,200లకు పి.లక్ష్మి అధికపాట పాడి దక్కించుకున్నారు. అదేవిధంగా ఎల్లమ్మ ఆలయం వద్ద కూల్‌డ్రింక్స్ విక్రయం, ఆలయానికి పూల సరఫరా కోసం నిర్వహించిన వేలంపాటలలో సరియైన పాటరాక పోవడంతో వాటిని వాయిదా వేస్తున్నట్లు ఆలయ ఈఓ అన్నపూర్ణ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, అధికారులు, టెండర్‌దారులు పాల్గొన్నారు.



వేలం నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

హుస్నాబాద్‌ను భార్గవపురంగా మార్చాలి

హుస్నాబాద్: హుస్నాబాద్ పేరును భార్గవపురంగా మార్చాలని సామాజిక కార్యకర్త పిడిశెట్టి రాజు శుక్రవారం సైకిల్ యాత్ర చేపట్టారు. భార్గవపురం సాధన సమితి కన్వీనర్ గంగిశెట్టి గాంధీ జెండా ఊపి సైకిల్ యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాకతీయులకాలంలో భార్గవపురంగా ఉండేదన్నారు. నిజాం కాలంలో హుస్నాబాద్‌గా మార్చారని, తిరిగి భార్గవపురంగా మార్చాలని ఊరిలో చాలా మంది కోరుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో స్ఫూర్తి అసోసియేషన్ అధ్యక్షుడు పందిల్ల శంకర్, సాంబమూర్తి, కొడం రమేష్, భూమయ్య పాల్గొన్నారు.



యాత్ర ప్రారంభిస్తున్న నేతలు

సీపీఐ సీనియర్ నాయకుడి మృతి

కోహెడ(హుస్నాబాద్): మండల కేంద్రానికి చెందిన సీపీఐ మండల నాయకుడు శ్రావణపల్లి లక్ష్మయ్య శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. మండల కార్యదర్శి వేల్పుల శ్రీనివాస్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. లక్ష్మయ్య పార్థివ దేహానికి పూలమాల వేసి ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. లక్ష్మయ్య మరణం పార్టీకి తీరనిలోటన్నారు. కార్యక్రమంలో గ్రామశాఖ కార్యదర్శి మల్లయ్య, బాలయ్య, రాజేశం, శేఖర్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల ముందస్తు అరెస్టు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి పోలీసులు పంచాయతీ కార్మికులను ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు అమ్ముల బాల్‌నర్సయ్య శుక్రవారం మాట్లాడారు. సమస్యల పరిష్కారంలో భాగంగా చలో హైదారాబాద్ కార్యక్రమానికి వెళ్లనున్న కార్మికులను అరెస్టు చేయడం దారుణం అన్నారు. జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా రాష్ట్ర కాలయాపన చేయం సరైందికాదని, నిరసనలు, ఆందోళనలు చేసే హక్కులను కాంగ్రెస్ ప్రభుత్వం హరిస్తుందని మండిపడ్డారు. కార్మికులను రూ.26 వేలు కనీసం వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

గొడవలకు దిగొద్దు: ఎస్‌ఐ

మద్దూరు(హుస్నాబాద్): రాబోయే స్థానిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా గ్రామస్తులు సహకరించాలని ఎస్‌ఐ షేక్ మహబూబ్ ప్రజలకు సూచించారు. సిప్పితండా గ్రామాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఎన్నికలు వస్తుపోతుంటాయి, వాటి కోసం గొడవలు పడటం సరికాదన్నారు. గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామస్తులు ముందుకు రావాలని కోరారు. యువత గంజాయి, ఇతర మత్తుపదార్థాల జోలికి వెళ్లవద్దని, ప్రభుత్వం నిషేధం విధించిన సారా, గుడుంబా తయారీకి దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలని, ఆన్‌లైన్ మోసాల బారిన పడితే వెంటనే 1930కు ఫోన్ చేసి సమాచారం అందించాలని చెప్పారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

దేశనాయకుల విగ్రహాల వద్ద నిఘా పెంచాలి

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మద్యం బాటిల్స్ పారవేయడంతో శుక్రవారం అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రజా సంఘాల నాయకులు, నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు రాజు, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కిషన్ మాట్లాడుతూ దేశ నాయకుల విగ్రహాల వద్ద పోలీసులు నిఘా పెంచాలన్నారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద మద్యం బాటిల్స్‌ను వేసిన వారిని త్వరగా పట్టుకోవాలని, లేకపోతే ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు కృష్ణ, భజరంగ్‌దళ్ మండల అధ్యక్షుడు రాజు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం

డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): రాష్ట్ర ప్రభుత్వం పేదల సొంతింటి కల సాకారం చేస్తోందని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి అన్నారు. మండలంలోని పీర్లపల్లి, పలుగుగడ్డ, మందాపూర్, దౌలాపూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీ ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చారని, రానున్న స్థానిక సంస్థల ఎన్ని కల్లో కాంగ్రెస్ నాయకులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, ఎంపీడీఓ రాంరెడ్డి, ఎంపీఓ ఖాజా, హౌసింగ్ ఏఈ విశాఖ, ఏఓ వసంతరావు, కాంగ్రెస్ నేతలు రవీందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, కరుణాకర్, రాము, జనార్దన్‌రెడ్డి, అజీజ్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



జగదేవ్‌పూర్(గజ్వేల్): పీర్లపల్లిలో భూమిపూజ చేస్తున్న నర్సారెడ్డి

పేదల కల సాకారం

బెజ్జంకి(సిద్దిపేట): సొంతిల్లు కావాలనే పేదల కల సాకారం చేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు అందిస్తోందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి అన్నారు. బెజ్జంకిలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ జెల్ల ప్రభాకర్, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నర్సయ్య, పోచయ్య, శ్రీకాంత్, కుమార్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారం

కొండపాక(గజ్వేల్): పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని నర్సారెడ్డి అన్నారు. మండల పరిధిలోని వెలికట్ట, సిర్సనగండ్ల గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. నియోజకవర్గంలో మొదటి విడతగా 3,500 ఇళ్లను మంజూరు చేశారని, లబ్ధిదారులకు మూడు విడతల్లో డబ్బులు ప్రభుత్వం జమ చేస్తుందని చెప్పారు. భూంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్‌రావు, లింగారావు, చిన్న శ్రీనివాస్, నరేందర్, కరుణాకర్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యం: హరికృష్ణ

సిద్దిపేటఅర్బన్: పేదల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. మండలంలోని ఎన్సాన్‌పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అధికారులు, నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొదటి విడతలో ఇళ్లు రాని ప్రతి వారికి రెండో విడతలో న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భిక్షపతి, గ్రామ అధ్యక్షుడు సత్యనారాయణ, డీసీసీ మహిళా విభాగం అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, మైనార్టీ విభాగం రాష్ట్ర నాయకుడు కలీమొద్దీన్, ఎస్సీసెల్ రాష్ట్ర నాయకుడు బొమ్మల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

- మెరుగైన విద్య, సౌకర్యాల కల్పన
- బీసీ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ ఇందిర



విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న జేడీ ఇందిర

దుబ్బాక: పేదల పిల్లలను ఉన్నత స్థాయికి తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తోందని బీసీ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ ఇందిర అన్నారు. దుబ్బాక ప్రభుత్వ బాలికలు, బాలుర కళాశాల, బాలికల హాస్టళ్లను శుక్రవారం ఆమె సందర్శించారు. హాస్టళ్లలో నెలకొన్న సమస్యల గురించి వార్డెన్లు, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ వసతి గృహాలలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు మెరుగైన విద్య, నాణ్యమైన ఆహారంతోపాటు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. పేద విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు.

మహామైసమ్మా.. కరుణించమ్మా..



ప్రత్యేక అలంకరణలో మైసమ్మ



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

ప్రారంభమైన ఆషాఢమాస పూజలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని మహా మైసమ్మ ఆలయంలో ఆషాఢమాస పూజలు శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. సామూహిక కుంకుమార్చనలు, ఒడి బియ్యం, అన్నప్రసాద పంపిణీ, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. దీంతో ఆలయ ప్రాంగణం అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. శనివారం మంటపారాధన, పంచామృతాభిషేకం, పల్లకి సేవ, అమ్మవారి ఊరేగింపు ఉంటుందని అర్చకుడు, నిర్వాహకులు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

గజ్వేల్‌రూరల్: వర్షాకాలం ప్రారంభమైందని, ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని గజ్వేల్ సబ్‌యూనిట్ అధికారి శ్రీనివాస్ సూచించారు. పీహెచ్‌సీ పరిధిలోని రిమ్మనగూడలో శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో డెంగీ, చికున్ గునియా, మలేరియా, ఫైలేరియా లాంటి విషజ్వరాలు వచ్చే ఆస్కారముందని, ముందు జాగ్రత్తతోనే వ్యాధులు ప్రబలకుండా నియంత్రించవచ్చన్నారు. నీటిని వేడి చేసుకొని తాగాలని, బయట లభించే ఆహార పదార్థాలను తీసుకోవద్దని సూచించారు. నీరు నిలిచే ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయాలని, ఇంటి పరసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, వైద్య సిబ్బంది ప్రేమ్‌చందర్, వాసుదేవ్, దుర్గాగౌడ్, మంజుల, ఆశా కార్యకర్తలు హేమలత, దర్గమ్మ పాల్గొన్నారు.



గజ్వేల్‌రూరల్: డ్రమ్ములో నిల్వ ఉన్న నీటిని పారబోస్తున్న వైద్య సిబ్బంది

గురువన్నపేటలో..

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని గురువన్నపేటలో పంచాయతీ కార్యదర్శి కరుణాకర్ ఆధ్వర్యంలో డ్రైడే నిర్వహించారు. నీటి ట్యాంకులలో నిల్వ ఉన్న నీటిని ఖాళీ చేయించారు. సీజనల్ వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టం అమలు చేయండి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు రవి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యాహక్కుచట్టం అమలయ్యే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు రవి డిమాండ్ చేశారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ జిల్లాలో వివిధ ఆకర్షణీయ పేర్లతో ప్రవేట్ విద్యాసంస్థలు తమ విద్య వ్యాపారం సాగిస్తున్నాయన్నారు. ఒక్క పాఠశాల కోసం అనుమతి తీసుకుని అనేక బ్రాంచ్‌లు ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. స్కూల్ డ్రెస్సు, పాఠ్యపుస్తకాలు, టైలు, షూలు తదితర పేర్ల మీద విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నారని, విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్, రవి, వినయ్, హేమంత్, శ్రావణ్, లడ్డు పాల్గొన్నారు.

కార్యకర్తకు ఆర్థిక సాయం

దౌల్తాబాద్(దుబ్బాక): ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని బీజేపీ మండల అధ్యక్షురాలు దేవుడి లావణ్య అన్నారు. మండల పరిధిలోని శేరిపల్లికి చెందిన కార్యకర్త రంగంపేట వేణు తండ్రి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఎంపీ రఘునందన్‌రావు ఆదేశాల మేరకు శుక్రవారం వారు వేణును పరామర్శించి రూ.10వేలు సాయం అందించారు. కార్యక్రమంలో నాయకులు చిక్కుడు స్వామి, గణేశ్, పోతురాజు కిషన్, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.